క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మాగనూర్: రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మాగనూర్ ఇంచార్జీ ఏఓ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. జూన్ 18వ తేదీలోగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చి, ఆధార్‌కార్డు ప్రకారం 18నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారానికి ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, నామినీ ఆధార్‌కార్డు జతచేసి సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు. రైతుబీమా నమోదు ప్రక్రియ ఆగస్టు 5వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

24గంటల విద్యుత్ సరఫరా చేయండి

మక్తల్: వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరపరా చేయాలని మక్తల్ మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పాలకులు చెబుతుండగా, వాస్తవంగా 9నుంచి 10గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేయడం సరికాదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరిసాగు చేస్తున్నారని, కరెంటు ట్రిప్ అయితే మోటర్లు కాలిపోతున్నాయని తెలిపారు. వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి

మరికల్: జిల్లాలో ప్రజాభిష్టం మేరకు కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని టీపీసీసీ సభ్యుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా పెద్దచింతకుంటలో విలేకరులతో మాట్లాడుతూ కొత్త మండలాల ఏర్పాటు కోసం ప్రజలు ఆందోళనలు, నిరాహారదీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. పాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్ష మేరకు కోటకొండ, గార్లపహాడ్, కానుకుర్తి, కొండాపూర్, జక్లేర్‌లను మండలకేంద్రాలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరికల్‌లో జూనియర్ కళాశాల, నారాయణపేటలో బాలికల జూనియర్ కళాశాల, మక్తల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు పంచాయతీ భవనాలు ప్రారంభం

నర్వ: మండలంలోని ఎల్లంపల్లి, లక్కర్‌దొడ్డి, రాజుపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ హాజరవుతారని, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్‌ఐ



నర్వ: ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆదివారం నర్వ నూతన ఎస్‌ఐ కురుమయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేశారు. మండలంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత



దామరగిద్ద: మండలంలోని వత్తుగుండ్లకు చెందిన లాలప్ప కుమార్తె అనూష వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీని ఆదివారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అందజేశారు. ఆపద సమయంలో సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ పకీరప్ప, లాలప్ప, బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

61వ రోజుకు చేరిన రిలే దీక్ష



నారాయణపేట రూరల్ : కోటకొండను మండలకేంద్రం చేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్ష ఆదివారం 61వ రోజుకు చేరింది. స్థానిక కూరగేరి, బొడెంగేరి వృద్ధులు దీక్షాశిబిరంలో కూర్చోగా, మండల సాధన సమితి సభ్యులు పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలకేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాము, యాదగిరి, కాశీనాథ్, చెన్నప్ప, సలీం పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు పాటించాలి
- ట్రాక్టర్, విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం
- అనుభవజ్ఞులైన వారితోనే యంత్రాలు వినియోగించాలి
- విద్యుత్ మరమ్మతు సమయంలో అప్రమత్తంగా ఉండాలి



కేజీవీల్స్‌తో కరిగెట చేస్తున్న రైతు

మాగనూర్: వానాకాలం సాగు ప్రారంభమైంది. రైతులు, వ్యవసాయ కూలీలు పొలంబాట పడుతున్నారు. పంటల సాగులో నిమగ్నమై చుట్టూ పరిసరాలను మరిచిపోతుంటారు. ఇలాంటి సమయంలో చిన్నచిన్న పొరపాట్లు, ఏమరపాటుతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ మరమ్మతు, ట్రాక్టర్ల వినియోగం సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి. విషసర్పాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అవగాహన లోపంతో ప్రమాదాలు..



రైతులకు సరైన అవగాహన లేక ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి. ప్రస్తుతం తగు జాగ్రత్తలతో ఖరీఫ్ పనులు చేసుకుంటున్నాం.

– అంజప్ప, యువరైతు, మాగనూర్

జాగ్రత్తలు తప్పనిసరి..



వర్షాకాలంలో రైతులు అనేక ప్రమాదాలకు గురవుతుంటారు. ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. పొలాలకు వెళ్లే సమయంలో చేతి కర్రతో చప్పుడు చేయడం వల్ల విషసర్పాల బారి నుంచి తప్పించుకోవచ్చు. వ్యవసాయ పనులకు వినియోగించే ట్రాక్టర్లను మైనర్లకు ఇవ్వకూడదు. అనుభవం కలిగిన డ్రైవర్లతోనే పొలం పనులు చేయించుకోవాలి.

– సుదర్శన్‌గౌడ్, ఇంచార్జీ ఏఓ, మాగనూర్

పెరిగిన ట్రాక్టర్ల వినియోగం

మండలంలో వానాకాలం సాగు పనులు ఊపందుకున్నాయి. రైతులు దుక్కులు దున్నడం, రోటవేటర్ కొట్టడం, విత్తనాలు విత్తడం తదితర పనులన్నీ ట్రాక్టర్లతోనే చేస్తున్నారు. వ్యవసాయ రంగంలో వీటి వినియోగం పెరిగింది. యంత్రాల వినియోగంలో అనుభవరాహిత్యమో.. అజాగ్రత్తతోనో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

– రైతులు కేజీవీల్స్ బదులు రోటర్ కిల్లర్ (రోటవేటర్)తో భూమి చదును చేసుకుంటే మేలు. కేజీవీల్స్ భూమి లోపలకి ఎక్కువగా దిగుతుండటంతో నీరు వృథా అయ్యే అవకాశం ఉంది.

- అనుభవం ఉన్న డ్రైవర్లతోనే కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపించాలి. ట్రాక్టర్ ముందుభాగంలో బంపర్ వద్ద 150 కేజీల బరువు అమర్చడం మంచిది. దీని వల్ల ట్రాక్టర్ గట్టు ఎక్కేటప్పుడు ముందు భాగం పైకి లేచి పల్టీ కొట్టకుండా ఉంటుంది.
- ట్రాక్టర్ పొలంలో దిగబడితే కట్టెలు పెట్టి ముందుకు నడుపుతుంటారు. దీని ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- కేజీవీల్స్ వెనుకల నాగళ్లు అమర్చుకోవడం వల్ల పల్టీ కొట్టదు.
- ముందు టైర్లు నీటిలో పూర్తిగా మునగకుండా చూసుకోవాలి.
- కేజీవీల్స్‌తో రోడ్డుపైకి వెళ్తే కేసు నమోదు చేస్తారు.

పాముకాటుతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు..

వర్షాకాలంలో ఎక్కువ మంది రైతులు పాముకాటుకు గురవుతుంటారు. దీనికి మందులు ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చిన్నారులు చెట్లు, పుట్టల వెంట తిరుగుతుంటారు. విషసర్పాలు, విషపు పురుగులు చల్లదనం కోసం పొలాల గట్టు, ఇండ్ల ఆవరణలో సంచరిస్తుంటాయి. రాత్రి సమయాల్లో జాగ్రత్తగా వెళ్లకపోతే పాముకాటుకు గురికావడం ఖాయం.

- వర్షాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లే వారు తమ వెంట టార్చ్‌లైట్ ఉంచుకోవాలి.
- కాళ్లకు బూట్లు లేదా కాలు పైభాగం వరకు కప్పి ఉంచే చెప్పులు ధరించాలి.
- చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ వెళ్లాలి.
- పాము కాటు వేస్తే భయపడకుండా ధైర్యంగా ఉండాలి.
- కాటు వేసిన చోట గాయం చేసి, రక్తం పోయేలా చూడాలి.
- పాము కాటు వేసిన ప్రాంతం నుంచి పది ఇంచులా దూరంలో తాడుతో గాని, చేతి రుమాలుతో గానీ గట్టిగా కట్టుకోవాలి.
- బాధితులను వెంటనే అస్పత్రికి తీసుకువెళ్లాలి.

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ మరమ్మతు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. పొలాల వద్ద విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్టార్టర్ల వద్ద చిన్నచిన్న మరమ్మతులు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది.

- విద్యుత్ మరమ్మతుల సమయంలో టెస్టర్ వినియోగించాలి.
- వర్షం పడితే మోటర్లు తడవకుండా చూడాలి.
- ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మోటర్లు, స్టార్టర్ల చుట్టూ పిచ్చిమొక్కలు , పొదలు ఉంటే తొలగించాలి. స్టార్టర్లు పొడి ప్రదేశంలో మాత్రమే అమర్చుకోవాలి. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, స్విచ్‌లను తాకకూడాదు.
- విద్యుత్ సమస్య ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియజేయాలి.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



మక్తల్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొండయ్య



ధన్వాడలో ఏబీవీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

మక్తల్: అర్హులైన ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం మక్తల్‌లోని రాంలీలా మైదానంలో వివేకానందస్వామి చిత్రపటానికి పూలమాల వేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 40 మందికిపైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అంజిరెడ్డి, నరేశ్, కార్యదర్శి వంశీ, శరణ్, మహేశ్‌సాగర్, మంజునాథ్, నాగేశ్, అశోక్ పాల్గొన్నారు.

మద్దూరు: ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఎస్సీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అరుణ్‌గౌడ్, అనిల్, శ్రీనివాస్, భాస్కర్, నరేశ్, గణేశ్, అశోక్, రఘు, భరత్ పాల్గొన్నారు.

ఊట్కూర్: మండలకేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆదివారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఏబీవీపీ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు జాతీయభావాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హన్మంతు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, చరణ్ భాస్కర్, వివేకానంద, అరుణ్, హరిహర, రాహుల్, ధర్మప్రకాశ్ పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవికుమార్‌గౌడ్, కురుమూర్తి, నవీన్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంపెనీ ఏర్పాటు చేయొద్దు

మరికల్: ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఇథనాల్ కంపెనీని ఏర్పాటు చేయొద్దని కుల అసమానతల సంఘం నాయకుడు చక్రవర్తి అన్నారు. కంపెనీ అనుమతులను రద్దు చేయాలని మండలంలోని చిత్తనూర్‌లో ఆదివారం చేపట్టిన దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్యం వల్ల పంటలు పండే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఇథనాల్ కంపెనీని అడ్డుకోకుంటే భవిష్యత్ తరాలకు కాలుష్య ముప్పు తప్పదన్నారు. కంపెనీని తొలగించే వరకు పోరాటం చేస్తామన్నారు.

నడ్డాను కలిసిన నామాజీ



నారాయణపేట రూరల్ :బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ ఆదివారం కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల సమావేశంలో నడ్డాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

క్రీడాకారులు తైక్వాండోలో రాణించాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు తైక్వాండోలో రాణించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా తైక్వాండో సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చైర్మన్ నిరంతరం సాధన చేయడం ద్వారా దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు మాట్లాడూతు తైక్వాండో నిబంధనలను మాస్టర్లు, విద్యార్థులకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ 55 మంది సీనియర్ క్రీడాకారులు, విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. అనంతరం బ్లాక్‌బెల్టు అవార్డింగ్ నిర్వహించి 13 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.సాయిలు, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, రాజు, భీమయ్య, శంకర్, లయ, వీణ, కార్తీక్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల వేడుక



పాతపాలమూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని 11వ వార్డు పాతపాలమూరులో శ్రీ మైసమ్మదేవి బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, మహిళల బొడ్డెమ్మల మధ్య బోనాల ఊరేగింపు ముందుకు కలిదింది. కార్యక్రమంలో నిర్వాహకులు కె.నాగయ్య, కె.నర్సిములు, ఎ.నారాయణ, ఎ.బాలకిష్టయ్య, ఎంకన్న, పి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం కుర్డినిశెట్టికాలనీలో తోట మైసమ్మ దేవి ఆలయంలో ఆషాడ మాసోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 లీటర్ల పాలతో అమ్మవారికి విశేష అభిషేకం చేశారు. అదేవిధంగా మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం బోనాల వేడుక వైభవంగా నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, వైస్ చైర్మన్ గణేష్, ముడా చైర్మన్ గంజి వెంకన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల పరిధిలోని తీగలపల్లి, చాకలపల్లి గ్రామాల్లో మైసమ్మ, పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. సర్పంచ్‌లు జంగయ్య, రాములమ్మ, చెన్నయ్య, శేఖర్, బాలకిష్టయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: చిన్నదర్పల్లిలో బోనాల వేడుక ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ లక్ష్మణ్, పాల్గొన్నారు.

యజ్ఞంతో కాలుష్య నివారణ

జడ్చర్ల టౌన్: యజ్ఞం నిర్వహించటం వల్ల పర్యావరణ కాలుష్యం నివారణ అవుతుందని ఆచార్యవేది సింధుయజ్ఞ అన్నారు. పట్టణంలోని ఆర్యసమాజంలో నూతన యజ్ఞభవన ప్రారంభోత్సవానికి ఆయన హాజరై ప్రసంగించారు. యజ్ఞయాగాదులు నిర్వహించడంతో అందులో పాల్గొన్న దంపతులలో రోగ నిరదోధక శక్తి పెరుగుతుందన్నారు. పూర్వకాలంలో రాజులు విరివిగా యజ్ఞయాగాదులు చేసేవారని, ప్రస్తుత కాలంలోనూ ముఖ్యమంత్రులు ఆసక్తిచూపుతున్నారన్నారు. భవన ప్రారంభోత్సవం అనంతరం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి, కౌన్సిలర్ చైతన్య, ఆర్యసమాజ పెద్దలు స్రవంతి, నందిని పాల్గొన్నారు.

ఉన్నత విద్యను అందుబాటులోకి తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

మరికల్: దినదినాభివృద్ధి చెందుతున్న మరికల్ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలని బీజేవైఎం రాష్ట్ర మీడియా ఇంచార్జీ విజయకుమార్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మరికల్ మండలంలో ఇప్పటి వరకు జూనియర్ కళాశాల లేకపోవడం సిగ్గుచేటన్నారు. మండల కేంద్రంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇక్కడి పాలకులకు ఓట్ల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల చదువుపై లేకుండా పోయిందన్నారు. మరికల్‌లో జూనియర్ కళాశాలతోపాటు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేణు, వెంకటేశ్, రమేశ్, నరేశ్‌గౌడ్, చిన్నరాయుడు ఉన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలి



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

కోస్గి: ఎంతోమంది ఆత్మబలిదానాలతో ఏర్పడిన తెలంగాణను దోపిడీ చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను కోరారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్రలో భాగంగా మున్సిపాలిటీలో చేపట్టిన ఇంటింటి ప్రచారం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటికెళ్లి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలనను వివరించారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, విజయకుమార్, రఘువర్ధన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్, ఇద్రీస్, నాయకులు నాగులపల్లి శ్రీనివాస్, నరేందర్, దేవేందర్, సురేశ్, వెంకట్రాములు, సలీం, ఆసీఫ్, ఫెరోజ్, ఇజాజ్, వెంకట్, గిరిప్రసాద్‌రెడ్డి, నర్సింహ, వెంకటయ్య, విద్యాసాగర్, ప్రతాప్, ప్రభోత్తం పాల్గొన్నారు.

పైపులైన్ పనులు ప్రారంభం



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మక్తల్: మాగనూర్ మండలం వర్క్యూర్ వాగు నుంచి మక్తల్ మండలం దాసర్‌దొడ్డికి తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్ నిర్మాణ పనులను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులతో నూతనంగా బోరుబావి తవ్వించి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహులు, ఉపసర్పంచ్ రంగప్ప, రాజు, వెంకటేశ్, శ్రీను, వాబన్న, నర్సింహులు, దేవేంద్రప్ప, ఉపసర్పంచ్ ఆంజనేయులు, శంకర్, వెంకటేశ్, రంగప్ప పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న భగవంతు

మక్తల్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా సబ్‌డివిజన్ కార్యదర్శి భగవంతు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, సంధ్య డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, వెంకటేశ్, రాంచంద్రి, నర్సింహ, నారాయణ పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రామాంజనేయులు, బాలప్ప, ఆంజనేయులు, చెన్నయ్య, నర్సింహులు, వెంకటయ్య, విజయ్, సరోజ పాల్గొన్నారు.

ఊట్కూర్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుశాంత్ మాట్లాడుతూ కార్మికులకు జీవోనెం. 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోలప్ప, పరశురాం, ఖాజీం, అంజప్ప, సత్యనారాయణ, అశోక్, మార్కండి, రాజు పాల్గొన్నారు.



ఊట్కూర్‌లో..

దామరగిద్ద: కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు జోషి, కార్మిక సంఘం నాయకులు శివానంద్, వెంకటప్ప, రఫీ అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేపట్టిన రిలే దీక్షకు మద్దతు తెలిపారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

కోయిల్‌కొండ: బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్, మహిళాసమాఖ్య నూతన భవనం, ఎంపీడీఓ కార్యాలయ ప్రహరీ, అదనపు గదుల నిర్మాణం తదితర పనులకు శంకుస్థాపన చేశారు. చేశారు. అంకిళ్ల బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఎంపీపీ శశికళ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, నాయకులు శమీం, రాజవర్ధన్‌రెడ్డి, ఆశన్నగౌడ్, రాజ్‌కుమార్, కుమ్మరిరాజు, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఖాళీ స్థలంలో నిర్మాణం చేపడతాం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఈద్గా వక్ఫే రహెమానియా పక్కన ఉన్న ఖాళీ వక్ఫ్ స్థలంలో ముస్లిం కమ్యూనిటీ హాల్ షాదీఖానా నిర్మాణాలు చేపడుతామని పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా రూ.కోటి నిధులతో వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈద్గా వద్ద నిర్మాణం చేపడుతారని కొందరు వాస్తవాలకు దూరంగా మాట్లాడుతున్నారని, కానీ ఈద్గా సమీపంలో ఖాళీగా ఉన్న వక్ఫ్ స్థలంలో నిర్మాణం చేపడుతామని తెలిపారు. నిర్మాణం తర్వాత భవనం ఈద్గా కమిటీకి చెందుతుందన్నారు. భవనాన్ని ఈద్ ప్రార్థనల కోసం వినియోగిస్తామన్నారు. అదేవిధంగా హాల్‌ను అనాథల వివాహాలకు ఉచితంగా ఇస్తామన్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాష, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌రహెమాన్, ఈద్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తఖీ హుస్సేన్, హాఫిజ్ ఇద్రీస్, జామియ మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్‌సనా, అబ్దుల్ జకీ, నాయకులు తదితరులు ఉన్నారు.